




ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 304 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
గురువారం 05 జూన్ 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# గత ప్రభుత్వంలో సీఎం హెలికాప్టర్‌లో వస్తున్నా చెట్లు నరికేశారు: చంద్రబాబు

అనంతవరం ఏడీసీఎల్ పార్కులో 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని ఏపీ సీఎం చంద్రబాబు ప్రారంభించారు.

**అమరావతి, జూన్ 5, (రిపబ్లిక్ న్యూస్):** నేడు ఒక్కరోజే కోటి మొక్కలు నాటుతున్నామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ ఏడాది 5 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. అమరావతి పరిధి అనంతవరం ఏడీసీఎల్ పార్కులో 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడారు. "రాష్ట్రంలో అడవులను 37 శాతానికి పెంచాల్సిన అవసరం ఉంది. అటవీ విస్తీర్ణం పెంచడంలో దేశానికే ఏపీ ఆదర్శంగా నిలవాలి. గత ప్రభుత్వం చెట్లు నరకడం తప్ప సంరక్షించింది లేదు. అప్పుడు సీఎం హెలికాప్టర్లో వస్తుంటే కూడా చెట్లు నరికారు. అలా నరికితే కొన్ని దేశాల్లో జైల్లో పెడతారు. మొక్కలు పెంచని వారికి గాలి పీల్చే హక్కు ఎక్కడిది?




## స్వర్ణాంధ్ర అంటే ఆదాయం మాత్రమే కాదు.. ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ

గ్లోబల్ వార్మింగ్ ప్రపంచానికే పెద్ద సవాల్గా మారింది. దీంతో వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. పద్మశ్రీ వనజీవి రామయ్య నా వద్దకు ఎప్పుడు వచ్చినా.. మొక్క తీసుకుని వచ్చేవారు. ఆయన్ను అందరం స్మరించుకోవాల్సిన అవసరముంది. ఇవాళ 16 రకాల మొక్కలు నాటాం. మూడేళ్ల వరకు మనం మొక్కను కాపాడితే తర్వాత అదే పెరుగుతుంది. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం కూడా పర్యావరణ పరిరక్షణలో కీలకమైంది. స్వర్ణాంధ్ర అంటే కేవలం ఆదాయం పెంచడం మాత్రమే కాదు. ఆరోగ్యం, పర్యావరణాన్ని రక్షించుకోవడమూ అందులో భాగమే. నా మనసుకు బాగా దగ్గరగా ఉండే సబ్జెక్ట్ పర్యావరణ పరిరక్షణ. ప్లాస్టిక్ వినియోగం మనుషులకే కాదు.. జంతువులకూ ప్రమాదంగా మారింది. మనం తినే తిండి, పండించే పంటలు ప్లాస్టిక్ మయం అవుతున్నాయి. కొందరు చికెన్ వ్యర్థాలను చేపల పెంపకంలో వాడుతున్నారు. చేపలకు చికెన్ వ్యర్థాలు వేస్తే... అనారోగ్య సమస్యలు వస్తాయి. స్వార్థంతో కాకుండా అందరం భావితరాల కోసం బతకాలి. రాయలసీమలో హార్టికల్చర్ బాగా అభివృద్ధి చెందుతోంది. చెత్త నుంచి కూడా సంపద సృష్టించే మార్గాలు ఉన్నాయి. వరి వ్యర్థాల నుంచి కూడా బయో ఫ్యూయల్ తయారు చేసే అవకాశం ఉంది. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రయత్నాలను గతంలోనే ప్రారంభించాం. తెదేపా ప్రారంభించిన ప్రయత్నాలను గత వైకాపా ప్రభుత్వం మధ్యలోనే నిలిపివేసింది." అని చంద్రబాబు అన్నారు.

## చెట్టు లేని జీవితాన్ని ఊహించలేం: పవన్ కల్యాణ్



పర్యావరణ పరిరక్షణ కోసం తన వంతుగా ఏదైనా సాధించి మాట్లాడతానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. చెట్టు లేని జీవితాన్ని ఊహించలేమని చెప్పారు. ఒకప్పుడు ఇంటి చిరునామాకు చెట్లే ఆనవాళ్లుగా ఉండేవని తెలిపారు. ప్రకృతిని ప్రేమించే వ్యక్తి మనకు సీఎంగా ఉన్నారని పేర్కొన్నారు. 50 శాతం పచ్చదనం లక్ష్యం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తామని వివరించారు.

# న్యాయ విద్యార్థిని శర్మిష్ఠ పనోలీకి మధ్యంతర బెయిల్

సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్, న్యాయ విద్యార్థిని శర్మిష్ఠ పనోలీ (22)కి మధ్యంతర బెయిల్ మంజూరైంది.

**దిల్లీ, జూన్ 5, (రిపబ్లిక్ న్యూస్):** సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్, న్యాయ విద్యార్థిని శర్మిష్ఠ పనోలీ (22)కి మధ్యంతర బెయిల్ మంజూరైంది. 'ఆపరేషన్ సిందూర్'పై సామాజిక మాధ్యమాల్లో తన భావాలను వెల్లడించే క్రమంలో ఒక వర్గాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై అరెస్టయిన ఆమెకు కలకత్తా హైకోర్టు గురువారం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.

దీంతో శర్మిష్ఠకు ఉపశమనం లభించినట్లయింది. మరోవైపు, మే 31న ఆమెను కోల్కతా పోలీసులు అరెస్టు చేయడంతో తీవ్ర రాజకీయ దుమారం చెలరేగిన విషయం తెలిసిందే. గత శనివారం న్యాయస్థానం ఆమెకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించగా.. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్లో ఉన్నారు.

## ఎవరీ శర్మిష్ఠ పనోలీ?



కోల్కతాలోని ఆనందపుర ప్రాంతానికి చెందిన శర్మిష్ఠ పుణె న్యాయ విశ్వవిద్యాలయంలో నాలుగో సంవత్సరం చదువుతోంది. లింక్డిన్ ప్రొఫైల్ ప్రకారం ఆమెకు ఇన్స్టాలో 94 వేలమంది ఫాలోవర్లు ఉన్నారు. రాజకీయాలపై తనదైన శైలిలో వ్యాఖ్యలు జోడించి అభిప్రాయాలను బలంగా చెప్పడం ద్వారా శర్మిష్ఠ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సరుగా పేరు సాధించింది. భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై బాలీవుడ్ ప్రముఖుల మౌనాన్ని ప్రశ్నిస్తూ మే 14న పోస్టు చేసిన వీడియో తీవ్ర వివాదాస్పదమై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో తన పోస్టులు, రీల్స్ తొలగించి ఆమె క్షమాపణలు కోరారు. శర్మిష్ఠను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందే అని డిమాండ్లు పెరగడంతో పోలీసులు రంగంలోకి దిగి ఎస్ఐఆర్ నమోదు చేశారు. ఆమె గురుగ్రామ్లో ఉన్నట్లు ట్రాక్ చేసి, శుక్రవారం అక్కడికి వెళ్లి అరెస్టు చేశారు.

# ఎన్కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత సుధాకర్ మృతి

మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ అలియాస్ సింహాచలం, గౌతమ్ మృతి చెందారు.



**చర్ల, జూన్ 5, (రిపబ్లిక్ న్యూస్):** మావోయిస్టు అగ్రనాయకుడు నంబాల కేశవరావు ఎన్కౌంటర్ జరిగిన నెలరోజుల్లోపే ఆ పార్టీకి మరో భారీ ఎదురు దెబ్బ తగిలింది. బీజాపుర్ జిల్లాలో జరిగిన ఎన్కౌంటర్లో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తెంటు లక్ష్మీ నరసింహాచలం మృతిచెందాడు. అతడు సుధాకర్గా పార్టీలో ప్రసిద్ధి చెందాడు. అతడికి గౌతమ్, ఆనంద్, చంటి బాలకృష్ణ రామరాజు, సోమన్న అనే మారు పేర్లు ఉన్నాయి. ఆయన స్వస్థలం ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం. గత 40 ఏళ్లుగా మావోయిస్టు ఉద్యమంలో ఉన్న సుధాకర్ పై రూ. కోటి రివార్డు ఉంది. 2004లో ప్రభుత్వంతో జరిగిన శాంతి చర్చల్లో ఆయన పాల్గొన్నారు. ఇంద్రావతి టైగర్ రిజర్వ్లో మావోయిస్టు సీనియర్ లీడర్లు ఉన్నట్లు భద్రతా దళాలకు పక్కా సమాచారం అందడంతో.. డీఆర్జీ, ఎస్టీఎఫ్ దళాలు ఆ ప్రాంతాన్ని దిగ్బంధించి తనిఖీలు మొదలుపెట్టాయి. ఈ క్రమంలో తెల్లవారుజామున దళాలు-మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు మొదలయ్యాయి. ఈ ఆపరేషన్లో కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ నేలకొరిగినట్లు సమాచారం. బీజాపుర్ ఎస్పీ డాక్టర్ జితేంద్ర యాదవ్ ఈ ఎన్కౌంటర్ను ధ్రువీకరించారు. అయితే సుధాకర్ మృతికి సంబంధించి ఎటువంటి ప్రకటను ఆయన జారీ చేయలేదు. బీజాపుర్ అడవుల్లో సెర్చ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఎన్కౌంటర్ జరిగిన స్థలం నుంచి పెద్దమొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకొన్నారు. ఆరునెలల వ్యవధిలో మావోయిస్టు కేంద్ర కమిటీకి చెందిన ముగ్గురు నాయకులను దళాలు ఎన్కౌంటర్ చేయడం గమనార్హం.

## మరికొందరు సీనియర్లు కూడా అక్కడే..!

ఇక తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మావోయిస్ట్ పార్టీ మాజీ ప్రెస్ ఇన్ఛార్జి బండి ప్రకాశ్, స్పెషల్ జోన్ కమిటీ సీనియర్ లీడర్ పాపారావు కూడా అక్కడే ఉన్నట్లు తమకు సమాచారం అందినట్లు బస్తర్ ఐజీ పి. సుందర్ రాజు ప్రకటన జారీ చేశారు. ప్రకాశ్ మావోయిస్టుల నియామకాలు, ప్రచారం, దక్షిణ బస్తర్ లో కార్యకలాపాలను పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఇతడిపై రూ.25 లక్షల రివార్డు ఉంది. ఇక పాపారావు గెరిల్లా యుద్ధతంత్ర నిపుణుడు. ఉచ్చులు పన్నడంలో దిట్టగా పేరుంది. చాలా ఐఈడీ ఇతర దాడుల్లో అతడు మోస్ట్వాంటెడ్గా ఉన్నాడు. అతడిపై రూ.20లక్షల రివార్డు ఉంది. వీరిద్దరికి సంబంధించిన సమాచారం వెల్లడి కాలేదు. కేవలం మూడు వారాల వ్యవధిలో మావోయిస్టులకు మరో భారీ ఎదురు దెబ్బ తగిలింది. వారి సీనియర్ నాయకత్వాన్ని భద్రతా దళాలు చుట్టుముట్టి.. కేంద్ర కమిటీ సభ్యుడిని ఎన్కౌంటర్ చేశాయి.

# 'ఈ గొప్ప అవకాశం నాకే దక్కింది'.. తన నివాసంలో 'సిందూర' మొక్క నాటిన ప్రధాని

ప్రధాని మోదీ తన అధికార నివాసంలో 'సిందూర మొక్కను నాటారు. 'ఎక్స్'లో పంచుకుంటూ ప్రత్యేక పోస్టు పెట్టారు.

**దిల్లీ, జూన్ 5, (రిపబ్లిక్ న్యూస్):** ప్రధాని నరేంద్ర మోదీ దిల్లీలోని తన అధికార నివాస ప్రాంగణంలో 'సిందూర మొక్కను నాటారు. బంగ్లాదేశ్ విముక్తి కోసం 1971లో పాకిస్థాన్తో భారత్ చేసిన యుద్ధంలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన మహిళా బృందం ఇచ్చిన ఈ మొక్కను.. పర్యావరణ దినోత్సవం సందర్భంగా నాటారు. అందుకు సంబంధించిన ఫొటోలను 'ఎక్స్' వేదికగా పంచుకున్న ఆయన ప్రత్యేక పోస్టు పెట్టారు.





"బంగ్లాదేశ్ విముక్తి కోసం పాకిస్థాన్తో భారత్ చేసిన యుద్ధంలో కల్కు చెందిన తల్లులు, సోదరీమణులు తమ వీర పరాక్రమాలను ప్రదర్శించారు. ఇటీవల నేను గుజరాత్లో పర్యటన చేసిన సమయంలో ఆ మహిళా బృందం నన్ను కలిసింది. అప్పుడే వారు నాకు ఈ మొక్కను అందించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కను నాటారు. ప్రధానమంత్రి నివాసంలో ఈ మొక్కను నాటే గొప్ప అవకాశం నాకు దక్కినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ మొక్క మన దేశ మహిళా శక్తి, శౌర్యం, స్ఫూర్తికి బలమైన చిహ్నంగా నిలుస్తుంది" అని ప్రధాని మోదీ పోస్టు చేశారు. అందుకు సంబంధించిన ఫొటోలను జత చేశారు. కాగా.. పహల్గాంలో ఉగ్రవాదులు మహిళల నుదుటి సిందూరాన్ని తుడిపేశారు. ఈ ఘటన తర్వాత ప్రతీకారానికి సిద్ధమైన భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్పై దాడులు నిర్వహించింది. ఈ క్రమంలోనే 1971 యుద్ధంలో భాగమైన మహిళా బృందం ప్రధానికి 'సిందూర మొక్కను బహూకరించింది. మోదీ మొక్క నాటుతున్న ఫొటోలు నెట్టింట వైరల్గా మారాయి.

# తొక్కిసలాట సమయంలో విధుల్లో 1000 మంది పోలీసులే.. హైకోర్టులో కర్ణాటక ప్రభుత్వం వెల్లడి

బెంగళూరులో తొక్కిసలాట జరిగిన సమయంలో 1000 మంది పోలీసులు మాత్రమే అక్కడ విధుల్లో ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది.

**బెంగళూరు, జూన్ 5, (రిపబ్లిక్ న్యూస్):** ఆర్సీబీ విజయోత్సవాల వేళ బెంగళూరులో సంభవించిన తొక్కిసలాట ఘటనపై కర్ణాటక హైకోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత న్యాయస్థానానికి వివరించింది. ఘటన సమయంలో చిన్నస్వామి స్టేడియం పరిసర ప్రాంతాల్లో 1000 మందికి పైగా పోలీసులు మాత్రమే విధుల్లో ఉన్నట్లు తెలిపింది. అయితే, అంతకుముందు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ.. ఆర్సీబీ ఈవెంట్కు 5వేల మంది పోలీసులతో భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పడం గమనార్హం.




తొక్కిసలాట ఘటనపై విమర్శలు రావడంతో ఈ వ్యవహారాన్ని హైకోర్టు సుమోటోగా పరిగణించింది. "వేడుక కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమం విషాదంగా మారింది. ఈ దుర్ఘటన వెనుక కారణాలను తేల్చాల్సిన అవసరం ఉంది. ఇలాంటి ఘటనలను మనం నివారించగలమా? భవిష్యత్తులో జరగకుండా ఉండాలంటే ఏం చేయగలం? అన్నవి ఆలోచించాలి" అని కోర్టు అభిప్రాయపడింది. అనంతరం ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదిస్తూ.. "రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని భద్రతా ఏర్పాట్లు చేశాం. వాటర్ ట్యాంకర్లు, అంబులెన్సు, కమాండ్ అండ్ కంట్రోల్ వాహనాలను సిద్ధంగా ఉంచాం. ఈ స్టేడియం సామర్థ్యం 35వేలు మాత్రమే. సాధారణ సమయాల్లో 30వేల టికెట్లు మాత్రమే ఇస్తారు. కానీ, నిన్నటి కార్యక్రమానికి దాదాపు 2.5 లక్షల మందికి పైగా అభిమానులు వచ్చారు. అందరినీ లోపలికి పంపిస్తారని వారు భావించారు. మధ్యాహ్నం నుంచే రద్దీ మొదలవ్వగా.. సాయంత్రానికి కిక్కిరిసిపోయి పరిస్థితి చేయిదాటిపోయింది" అని వివరించారు. తాము నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించలేదని ప్రభుత్వం ఈ సందర్భంగా తెలిపింది. ఈ విషయంలో న్యాయస్థానం ఎలాంటి ఆదేశాలిచ్చినా పాటించేందుకు సిద్ధంగా ఉందని పేర్కొంది. వాదనలు విన్న ధర్మాసనం దీనిపై తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి (జూన్ 10వ తేదీకి) వాయిదా వేసింది.

# జగన్.. మీ తీరు మారకపోతే ఈసారి మిగిలేది ఒక్కటే: రామ్మోహన్ నాయుడు

వైకాపా అధినేత జగన్.. ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీయడమే పనిగా పెట్టుకున్నారని కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు విమర్శించారు.



**శ్రీకాకుళం, జూన్ 5, (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా అధినేత జగన్.. ఏపీ బ్రాండ్ ఇమేజ్ను దెబ్బతీయడమే పనిగా పెట్టుకున్నారని కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు విమర్శించారు. వైకాపా ప్రభుత్వం చెయ్యలేని ఎన్నో పనులను కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసి చూపించిందని అన్నారు. శ్రీకాకుళంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. " ఏడాదిలో దురుద్దేశ ఆందోళనలు తప్ప నిర్మాణాత్మక సూచనలు చేశారా? రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలి. పెట్టుబడులు రాకూడదన్నది జగన్ ఆలోచన. రాష్ట్రానికి జగన్ తీరని ద్రోహం చేశారు. అందుకే ప్రజలు ఆ పార్టీని 11కే పరిమితం చేశారు. జగన్ తీరు మార్చుకోకపోతే 11లో ఈసారి మిగిలేది ఒకటే" అని రామ్మోహన్ నాయుడు ఎద్దేవా చేశారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

